క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ


సతీష్ కుమార్

చిప్పగిరి: ఎస్‌ఐగా సతీష్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు వరకు ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రమేష్ బాబు వీఆర్ కర్నూల్‌కు బదిలీ కాగా వీఆర్ కర్నూల్‌లో ఉన్న సతీష్ కుమార్ చిప్పగిరి ఎస్‌ఐగా వచ్చారు.

సబ్‌కలెక్టర్‌ను కలిసిన పత్తికొండ ఆర్డీఓ


సబ్‌కలెక్టర్‌కు పూల మొక్కను అందజేస్తున్న పత్తికొండ నూతన ఆర్డీఓ భరత్‌నాయక్

ఆదోని రూరల్: పత్తికొండ ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన భరత్‌నాయక్ ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూల మొక్క అందజేశారు.

పంచాయతీ కార్యాలయం తనిఖీ


ముత్తుకూరులో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతావాణి

ఆస్పరి: మండలంలోని ముత్తుకూరు పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీఓ గీతావాణి బుధవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి జంప్లానాయక్, సిబ్బందితో మాట్లాడుతూ గ్రామంలో పరిసరాలను శుభ్రంగా ఉండేటట్లు, మంచి నీటి సమస్య లేకుండా చూడాలని, డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించాలని ఆదేశించారు.

చెగువేరా వర్ధంతి


చెగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

దేవనకొండ: స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం విప్లవ వీరుడు చెగువేరా 57వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు బి.రవికుమార్, ఎం.రామాంజనేయులు మాట్లాడుతూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజీవ్, రాజశేఖర్, కిషోర్, నరేష్, గంగన్న, హరీష్ పాల్గొన్నారు.

ఆస్పరి: విప్లవకారుడు చెగువేరా వర్ధంతిని బుధవారం మండలంలోని కైరుప్పల గ్రామంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా.. చెగువేరా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువత ఆయన అడుగు జాడల్లో నడవాలని కోరారు. రమేష్, శేఖర్, చందు, సురేష్, మహేష్, రేవన్, వీరాంజి పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

మద్దికెర : రబీలో సాగు చేసే పప్పుశనగ విత్తనాలను తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని ఏఓ రవి అన్నారు. బుధవారం మద్దికెర గ్రామ పరిసరాల్లో విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. కిలో విత్తనానికి 6 ఎంఎల్ క్లోరోపైరిఫాస్, 2 గ్రాముల సాఫ్‌తో కలిపి విత్తే ముందు 10 గ్రాముల ట్రైకోడెర్మివిరిడి లేదా 10 మి.లీ రైజోబియం చేసుకోవాలన్నారు. విత్తనశుద్ధి చేయడం వల్ల 25–30 రోజుల వరకు పంటను తెగుళ్ల బారి నుంచి రక్షించుకోవచ్చన్నారు. వ్యవసాయ సహాయకులు జాకీర్, రైతు శ్రీరాములు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం


మధును సన్మానించిన కురుబ సంఘం పెద్దలు

ఆలూరు: అంతర్జాతీయ స్థాయి సెపక్‌తక్రా క్రీడలో సత్తా చాటుతున్న మండల కేంద్రానికి చెందిన మధును మాదాసి/మాదారి కురుబ సంఘం పెద్దలు బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో సన్మానించారు. ఇటీవల చైనాలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి కాంస్య పతకాన్ని సాధించడం దేశానికి గర్వ కారణమని శేషప్ప,అరికెర చంద్ర, లింగమూర్తి ,రాజ్ అభినందించారు. సంఘం రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి రామ్‌మోహన్, నియోజకవర్గం గౌరవ అధ్యక్షుడు రంగన్న, కన్వీనర్ రాజు పాల్గొన్నారు.

మద్యం షాపుల దరఖాస్తుకు గడువు పెంపు

వెల్దుర్తి(కృష్ణగిరి): మద్యం షాపుల దరఖాస్తు గడువును ఈ నెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు పొడగించినట్లు కోడుమూరు ఎక్సైజ్ సర్కిల్ సీఐ మంజుల బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు కోడుమూరు సర్కిల్ పరిధిలోని 14 షాపులకు గాను 350 దరఖాస్తులు వచ్చాయన్నారు. వెల్దుర్తిలోని 3 షాపులకు 89 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. పెంచిన గడువును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధరతో దగా..

- పేరుకే రాయితీ శనగ
- గత ఏడాది 40 శాతం సబ్సిడీతో క్వింటా ధర రూ.4,860
- ప్రస్తుతం 25 శాతం సబ్సిడీతో క్వింటా ధర రూ.7,050
- పూర్తి ధరను పెంచి రాయితీని తగ్గించిన కూటమి ప్రభుత్వం
- కొనుగోలుకు ఆసక్తి చూపని రైతులు
- ధర పెంపుపై ఆగ్రహం

వ్యవసాయాన్ని గాలికొదిలేసే ప్రభుత్వంగా టీడీపీకి పేరుంది. శనగ విత్తనాలను రాయితీపై అందించేందుకు బహిరంగ మార్కెట్ ధరకు సమానంగా ప్రకటించడమే కాకుండా.. సబ్సిడీని కూడా తగ్గించి రైతులకు అధిక ధరకు అంటగడుతుండటంతో విత్తనాలు తీసుకునేందుకు అన్నదాతలు ముందుకు రావడం లేదు. విత్తనాల పూర్తి ధరను పెంచి, సబ్సిడీని తగ్గించడంపై రైతులు మండిపడుతున్నారు. గతేడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 40 శాతం రాయితీ అందించి తక్కువ ధరకు విత్తనాలు అందజేసింది.

ఆస్పరి/చిప్పగిరి: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ శనగ విత్తనాలపై రైతులు ఆసక్తి చూపడం లేదు. గత ఏడాది కన్నా క్వింటా ధరను ఎక్కువగా చూపడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పప్పు శనగ విత్తనాలు పూర్తి ధర రూ. 8,100 నిర్ణయించి అందులో 40 శాతం సబ్సిడీ ప్రకటించి క్వింటా ధర రూ. 4,860 వేలకు రైతులకు అందజేసింది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం పూర్తి ధర రూ.9,400 నిర్ణయించి అందులో 25 శాతం సబ్సిడీతో క్వింటా ధర రూ.7,050 ప్రకటించింది. దీంతో గత ఏడాది కన్నా క్వింటాకు రూ.2,190 అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి. ప్రస్తుత మార్కెట్‌లో క్వింటా శనగల ధర రూ.7,200 వరకు ఉందని, ప్రభుత్వం ఇస్తున్న ధరతో పోలిస్తే క్వింటాకు రైతుకు మిగులుతున్నది కేవలం రూ.150 మాత్రమేనని రైతులు మండిపడుతున్నారు. క్వింటా ధరను పెంచేసి రాయితీ అని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం రాయితీతో మిగులుతున్న రూ.150 కార్యాలయాలకు తిరగడానికి, రవాణా ఖర్చులకు కూడా సరిపోవంటున్నారు. దీంతో ప్రభుత్వం అందిస్తున్న రాయితీ శనగ విత్తనాలపై రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం ఇచ్చే ధర బయట వ్యాపారులు అమ్మే ధర ఒక్కటే కావడంతో రైతులు అక్కడే శనగలను తెచ్చుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో విత్తనాల కోసం రిజిస్టర్ చేసుకునేందుకు రైతులు ముందుకు రాకపోవడంతో కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. ఆస్పరి మండలంలో ఆస్పరి, శంకరబండ, చిన్నహోతూరు, జొహరాపురం, చిరుమాన్‌దొడ్డి, హలిగేర, చిగిళి, బిణిగేరి, నగరూరు, కారుమంచి, బనవనూరు, తంగరడోణ గ్రామాల్లో ఈఏడాది రబీలో 6వేల హెక్టార్లలో పప్పుశనగను సాగు చేయనున్నారని ఏఓ నరేంద్రకుమార్ తెలిపారు. ఆస్పరి మండలానికి 6,300 క్వింటాళ్లను ప్రభుత్వం మంజూరు చేయగా ఇందులో ఇప్పటి వరకు 1,248 మంది రైతులు 2,200 క్వింటాళ్లకు రిజిస్టర్ చేయించుకున్నారు. చిప్పగిరి మండలంలో 7,500 ఎకరాల్లో శనగ పంట సాగు చేస్తారు. చిప్పగిరి మండలానికి 4,550 క్వింటాళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 50 శాతం కూడా పప్పు శనగ విత్తనాలు రైతులు తీసుకోలేదు. సాధారణంగా ఎకరాలో పంట సాగుకు 40 కేజీల విత్తనాలు అవసరమవుతాయి. ప్రభుత్వం ఎకరాకు 20 కేజీలు ప్రకారం 5 ఎకరాల వరకు విత్తనాలు ఇస్తుంది. దీంతో 5 ఎకరాలు పైబడిన రైతులు బహిరంగ మార్కెట్‌లో తెచ్చుకుని విత్తుకుంటున్నారు.


శంకరబండ వద్ద శనగ విత్తనాలను రిజిస్టర్ చేయించుకునేందుకు వచ్చిన రైతులు


చిప్పగిరిలో శనగ విత్తుతున్న దృశ్యం

ఆలూరు నియోజకవర్గానికి కేటాయించిన పప్పు శనగ, రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల వివరాలు..

మండలం	కేటాయించిన పప్పుశనగ(క్విం..)	రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు	సాగు విస్తీర్ణం హెక్టార్లలో
ఆలూరు	8,762	2,700	10,403
ఆస్పరి	6,300	1,288	9,047
చిప్పగిరి	4,450	950	9,081
హాలహర్వి	3,250	1,100	6,852
హొళగుంద	200	100	745
దేవనకొండ	500	120	448

రైతులకు సహకరించని ప్రభుత్వం



నేను 10 ఎకరాల్లో విత్తనం వేస్తా. గత ప్రభుత్వం కంటే ఈప్రభుత్వం క్వింటా ధరను రూ.2,190 పెంచిందిరు. ఇది రైతులకు ఉపయోగపడే నిర్ణయం కాదు. ఒక ఎకరాకు రూ.15వేలు పెట్టుబడి పెట్టి గత ఏడాది పప్పు శనగను సాగు చేస్తే దిగుబడి రాక రూ.1.50 లక్షలు ఆర్థికంగా నష్టపోయా. గత ఏడాది రబీలో వేసిన పంటకు కరువు ప్రకటించినా ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకు నష్టపరిహారం అందలేదు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పత్తి, వేరుశనగ పంటలు నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇచ్చారు. కూటమి ప్రభుత్వం రైతులకు సహకరించడం లేదు.

– ప్రకాష్, రైతు, ఆస్పరి

రైతులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదు



ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ విత్తనాలు రైతులకు ఏమాత్రం ఉపయోగ పడటం లేదు. 50 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలను ఇవ్వాలని అధికారులకు తాము విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. బహిరంగ మార్కెట్ ధరనే ప్రభుత్వం నిర్ణయిస్తే ఏం లాభం. రైతులకు మేలు చేసే విధంగా నిర్ణయించాలి కానీ.. ఇలా వ్యవహరించరాదు. కేవలం సబ్సిడీ ఇస్తున్నామని చెప్పడానికి మాత్రమే చేస్తున్నట్లు ఉంది. గత ఏడాది రబీ పంట నష్ట పరిహారం మంజూరైనా ప్రభుత్వం ఇవ్వకపోవడాన్ని చూస్తే రైతుల పట్ల వారి చిత్తశుద్ధి తెలిసిపోతోంది.

– హనుమంతు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

వందశాతం రాయితీ ఇవ్వాలి



ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావం, తీవ్ర వర్షాల కారణంగా నియోజకవర్గంలో చాలా మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారు రబీలో పంటలు సాగు చేస్తున్నారు. రైతులకు పెట్టు బడి సాయంగా రూ 20 వేలు ఇస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు అమలుకు నోచుకోకపోవడంతో పెట్టుబడి సాయం అందక ప్రైవేటు వ్యక్తుల వద్ద వడ్డీలకు తీసుకుంటున్నారు. పప్పుశనగ విత్తనాలకు వంద శాతం రాయితీ ఇచ్చి వారిని ఆదుకుంటే కొంతమేర బయటపడతారు.

– విరుపాక్షి, ఎమ్మెల్యే

అవసరమైన వారు పేర్లు నమోదు చేసుకోవాలి



మండలానికి 4,550 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలు మంజూరయ్యాయి.ఆసక్తి కలిగిన రైతులు తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకొని విత్తనాలు పొందవచ్చు. ఇప్పటివరకు 2వేల క్వింటాళ్లు వివిధ గ్రామాల రైతులు తీసుకున్నారు.మిగతా 2,550 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి.

– విజయలక్ష్మి, ఏఓ,చిప్పగిరి

ఆస్పరి రెవెన్యూ కార్యాలయం తనిఖీ


ఆర్డీఓ భరత్‌నాయక్‌కు మొక్క అందజేస్తున్న తహసీల్దార్ శివశంకర్ నాయక్, ఉద్యోగులు

ఆస్పరి: స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని పత్తికొండ ఆర్డీఓ ఎస్. భరత్ నాయక్ బుధవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మండలంలోని ఖరీఫ్ సీజన్‌లో వేసిన ఈ–పంట నమోదు రికార్డులను పరిశీలించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్, ఆర్‌ఐ భీమేష్‌కు సూచించారు. అంతకు ముందు రెవెన్యూ ఉద్యోగులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీఓకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు.

ఆలూరు రూరల్: తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ప్రజలు ఇచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్ సూచించారు. బుధవారం ఆలూరు తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించి అడంగల్ కరెక్షన్, పేరు మార్పు, విస్తీర్ణం మార్పులు, చేర్పులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరిందని తహసీల్దార్ గోవింద్ సింగ్ ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌ఐ బసవన్న గౌడ్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

బన్ని ఉత్సవాలను విజయవంతం చేద్దాం


అరికెరలో మాట్లాడుతున్న సీఐ కె.శ్రీనివాసనాయక్

హొళగుంద: ఈ నెల 12న రాత్రి జరిగే దేవరగట్టు బన్ని ఉత్సవ ఏర్పాట్లను బాధ్యతగా, పకడ్బందీగా చేపట్టి విజయవంతం చేద్దామని ఆలూరు సీఐ శ్రీనివాసనాయక్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. బుధవారం దేవరగట్టులో ఆయా శాఖల మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఉత్సవానికి ఈ ఏడాది భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశాలున్నాయని ముందు జాగ్రత్తగా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. వాహనాల పార్కింగ్ స్థలం, తాగునీరు, హెల్త్ క్యాంప్, విద్యుత్ సౌకర్యం, సీసీ కెమెరాలు, బారికేడ్ల ఏర్పాటు, పారిశుద్ధ్యం లోపించకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గట్టులో ఉత్సవాల నిర్వహణ పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్‌ఐ బాల నరసింహులు, డిప్యూటీ తహసీల్దారు నిజాముద్దీన్, ఎంపీడీఓ, వీఆర్‌ఓలు, హెల్త్ సిబ్బంది, నెరణికి, నెరణికి తండా, కొత్తపేటకు చెందిన ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టులో కొలువుదీరిన శ్రీ మాళ మల్లేశ్వరస్వామి బన్ని ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆలూరు సీఐ కె.శ్రీనివాసనాయక్ సూచించారు. మండలంలోని అరికెర గ్రామంలో ప్రజలకు బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ గోవింద్‌సింగ్, ఎంపీడీఓ జి.రమాదేవి, ఎస్‌ఐ సివి.నరసింహులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి


మహిళకు నోట్ పుస్తకాల కిట్‌ను అందజేస్తున్న న్యాయమూర్తి హేమ

ఆలూరు: రాజ్యాంగంలో మహిళలకు కల్పించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి హేమ తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం సీడీపీఓ మద్దమ్మ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, పొదుపు గ్రూపు సభ్యులు, మండల, గ్రామైక్య మండల లీడర్లు, వెలుగు సీసీలకు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహిళకు నోట్ పుస్తకాల కిట్‌ను అందజేశారు. ఆలూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వాయుజీవోత్తంరావు, షేక్షావలి, ప్రవీణ్‌కుమార్, న్యాయవాదులు, వెలుగు ఏపీఎం ఆంజనేయులు, సీసీలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు గుర్తించండి

చిప్పగిరి: గ్రామాల్లో ఉపాధి హామీ పనులు గుర్తించాలని ఎంపీడీఓ అల్లాబకాష్ ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లక్ష్మణ్, మారుతి, కదిరప్ప, రాఘవేంద్ర పాల్గొన్నారు.

రైతులు సలహాలు పాటించాలి

హాలహర్వి: రైతులు పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి శివశంకర్ సూచించారు. బుధవారం మండలంలోని బేవినహాల్, కొక్కరచేడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు జయశ్రీ, మన్మథరెడ్డి, కన్వీనర్ సుధాకర్, ఎంపీఈఓ జయకుమార్, రైతులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తూ పత్తికొండకు బదిలీపై వెళ్లిన నరసింహులును బుధవారం సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆయనను సన్మానించారు. ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి అని, సేవలే గుర్తింపునిస్తాయని పలువురు కొనియాడారు.

చేపల పెంపకానికి వేలం

కృష్ణగిరి: స్థానిక హంద్రీనీవా రిజర్వాయర్‌లో చేపల పెంపకానికి బుధవారం మండల కేంద్రంలోని సచివాలయంలో సర్పంచ్ వరలక్ష్మి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వేలంలో రూ.77వేలకు పలికిందని గాజులదిన్నె ప్రాజెక్టు అధికారి చంద్రయ్య తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.66,131కు గాను వేలం పాటలో పాల్గొన్న ఇద్దరిలో బజారి రూ.77 వేలకు దిక్కించుకున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది జూన్ 30 వరకు ఈ వేలం వర్తిస్తుందన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

హొళగుంద: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ రస్తాలో పడిన గుంతలను సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ గ్రావెల్ వేసి చదును చేయించారు.ఈ దారిలో పొలాలు, హొన్నూరు క్యాంపు వరకు స్థానికులు, భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే గుంతలుపడి అధ్వానంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్తున్నారు. సమస్యపై గత నెల 27న సాక్షిలో నడవడానికీ వీలు కానంతగా.. అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీంతో వారు బుధవారం గుంతలు పూడ్చించారు. ఈ దారిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటుకు రూ.10 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు పీఆర్ ఏఈ సోమప్ప తెలిపారు.

సుబ్రహ్మణ్య స్వామికి షష్టి పూజలు

మద్దికెర : స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో స్వామి వారికి బుధవారం షష్టి సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. దేవసేన, శ్రీవల్లి సమేతుడై కొలువుదీరగా అర్చకులు హోమాలు జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు.



పత్తికొండలో సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన వాసవీమాత, సాయిబాబా ఆలయంలో సరస్వతీగా దర్శనమిచ్చిన సరస్వతీదేవి


తుగ్గలిలో సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత


సరస్వతీదేవి అలంకరణలో రాజ్యలక్ష్మి

సరస్వతీ..భగవతీ



రామతీర్థంలో, వెల్దుర్తి అమ్మవారిశాలలో హోమాలు నిర్వహిస్తున్న భక్తులు


మద్దికెర: మహాలక్ష్మి రూపంలో దేవమ్మ


కటారుకొండలో సరస్వతిదేవిగా దుర్గామాత


హొళగుందలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పత్తికొండ(తుగ్గలి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం పత్తికొండ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీమాత శ్రీ సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయిబాబా ఆలయంలో సర్వతీదేవి తుగ్గలిలో దుర్గామాత సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. సంగీత సాహిత్యాలకు సరస్వతీ దేవి అధిష్టాన దేవత కావడంతో అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఆస్పరి: రామతీర్థంలో వెలసిన పంచముఖి గాయత్రీ మాత, పార్వతీదేవి, మండల కేంద్రంలో వెలసిన కన్యకాపరమేశ్వరి, మారెమ్మవ్వ, జొహరాపురంలో పెద్దమ్మవ్వ సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

మద్దికెర : పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి దేవాలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రంగనాథుడిని సతీ సమేతంగా శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అలాగే స్థానిక చౌడేశ్వరి దేవాలయం, దేవమ్మ దేవాలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. దేమమ్మ మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు.

ఆలూరు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ నిర్వహకులు ప్రత్యేక పూజలు చేశారు.

కృష్ణగిరి: మండలంలోని కటారుకొండ గ్రామంలో దుర్గాదేవి సరస్వతీదేవిగా, వెల్దుర్తిలోని అమ్మవారిశాలలో సరస్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి, వెల్దుర్తిలో భువన గాయత్రి దేవి సరస్వతీ దేవిగా దర్శినమిచ్చారు.






ఆస్పరి: సరస్వతీ దేవి అలంకరణలో గాయత్రీ మాత, కన్యకాపరమేశ్వరి ఆలూరు: సరస్వతీ దేవిగా వాసవీ మాత, వెల్దుర్తిలో సరస్వతీదేవిగా భువన గాయత్రి

నూతన డిపాజిట్ పథకాన్ని వినియోగించుకోండి

తుగ్గలి : సహకార సంఘాల్లోని ఖాతాదారులకు ఉపయోగపడేలా కొత్తగా 333 రోజుల 'కర్షకవృద్ధి' డిపాజిట్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఉప్పర్లపల్లి, మారెల్ల సహకార సంఘాల సీఈఓలు గిడ్డయ్య, మనోహరనాయుడు తెలిపారు. బుధవారం ఆయా సంఘాల పరిధిలోని రైతులు, ఖాతాదారులకు డిపాజిట్ పథకంపై అవగాహన కల్పించారు. 333 రోజుల కర్షక వృద్ధి డిపాజిట్ పథకంలో సీనియర్ సిటిజన్లకు 8 శాతం వడ్డీ, 60 ఏళ్లలోపు వారికి 7.50 శాతం మేర వడ్డీ వర్తిస్తుందన్నారు. రూ.5లక్షల వరకు బీమా గ్యారెంటీ ఉంటుందని, నవంబరు 1వ తేదీ వరకు అవకాశం ఉందని వివరించారు.

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

దేవనకొండ: కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏపీ వలంటీర్ అసోసియేషన్ నాయకులు రవికుమార్, భాస్కర్, గంగన్న, రాజీవ్, కిశోర్, ప్రసాద్, రాజశేకర్, హరి డిమాండ్ చేశారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో మంలంలోని వలంటీర్లు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇంతవరకు వాటి గురించి మాట్లాడడం లేదన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎం.నరసారావు, చెన్నకేశవ, హరీష్, రమేష్, రాజ్‌కుమార్, సలీం, రంగస్వామి, నరేష్, వలంటీర్లు పాల్గొన్నారు.